# పాలమూరులో పల్లి రైతు లొల్లి



మహబూబ్‌నగర్ మార్కెట్‌లో ఇస్తామన్న ధర ఇవ్వాలని ఆందోళనకు దిగిన పల్లి రైతులు

- రూ.200 ధర పెంచుతామని చెప్పి మాటతప్పడంతో ఆందోళన
- మార్కెట్‌లోకి రైతులను అనుమతించని పోలీసులు

పాలమూరు, జనవరి 29 : మహబూబ్‌నగర్ మార్కెట్‌లో పల్లి రైతులు రెండో రోజు కూడా ఆందోళనకు దిగారు. మంగళవారం నాటి ఆందోళనకు దిగివచ్చిన అధికారులు క్వింటాల్‌కు రూ.200 ధర పెంచి ఇస్తామని చెప్పి మాట తప్పడంతో బుధవారం కూడా నిరసన చేపట్టారు. తెల్లవారుజామున 4 గంటల నుంచే పల్లి కొనుగోళ్ల ప్రక్రియ ప్రారంభించారు. పాత ధరకే కొంటుండటంతో రైతులు వ్యాపారులను నిలదీశారు. ధర పెంచితే తమకు నష్టం వస్తుందని, తమపై భారం పడుతుందని తెగేసి చెప్పారు. దీంతో రైతులు మళ్లీ ఆందోళనకు దిగారు. మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బెక్కరి అనిత రూ.200 పెంచుతున్నామని చెప్పినా వ్యాపారులు లెక్కచేయకుండా పాత ధరకు కొనుగోలు చేస్తుండటంతో మార్కెట్ కమిటీ కార్యాలయాన్ని చుట్టుముట్టారు. విషయం తెలుసుకొన్న పోలీసులు అక్కడికి చేరుకొని సముదాయించే ప్రయత్నం చేశారు. వారు వినకపోవడంతో ముందస్తుగా బయటకు వెళ్లకుండా మార్కెట్ యార్డు గేట్లను మూసివేశారు. మార్కెట్ కార్యాలయంలోకి కూడా వెళ్లకుండా అక్కడా గేట్ బంద్ చేశారు. మంగళవారం మార్కెట్ పాలకవర్గం ఇచ్చిన హామీ మేరకు క్వింటాకు రూ.200 పెంచి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం వ్యాపారులతో చైర్‌పర్సన్, ఆర్డీవో, తహసీల్దార్, పోలీస్ అధికారులు సమావేశమయ్యారు. రైతులకు ఇచ్చిన హామీ మేరకు ధర పెంచాలని నిర్ణయించడంతో ఆందోళన విరమించారు. పెంచిన ధర ఇవ్వకపోతే మళ్లీ నిరసనకు దిగుతామని రైతులు హెచ్చరించారు.




డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేస్తే వచ్చేదే ట్రాన్స్‌ఫార్మరయ్యా!



ఖమ్మం జిల్లా వైరాలోని లాలాపురం వద్ద కల్లంలో మిర్చిని చూపిస్తూ నిరసన తెలుపుతున్న రైతు సంఘం నాయకులు, రైతులు

## వైరాలో మిర్చి రైతు ఆందోళన

### క్వింటాలుకు 20 వేలు చెల్లించాలని డిమాండ్

వైరా టౌన్, జనవరి 29: మిర్చికి మద్దతు ధర చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఖమ్మం జిల్లా వైరా పట్టణంలోని లాలాపురంలో రైతులు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు బుధవారం మిర్చి పంటలను, కళ్లాలను పరిశీలించారు. అనంతరం సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, వైరా పట్టణ కార్యదర్శి చింతనిప్పు చలపతిరావు మాట్లాడుతూ.. సరైన ధర లేక, భవిష్యత్తులో ధర పెరుగుతుందన్న ఆశలేక ఖమ్మం జిల్లాలోని మిర్చి రైతులు తక్కువ ధరకు పంటను విక్రయించి తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నాఫెడ్, మార్క్‌ఫెడ్ ద్వారా క్వింటా మిర్చికి రూ.20 వేల కనీస ధర నిర్ణయించి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. తామర పురుగు, తెగుళ్లు వంటి కారణాల వల్ల మిర్చి రైతులు ఇప్పటికే తీవ్ర నష్టపోతున్నట్టు తెలిపారు.

- కరెంట్ కోతలు నివారించాలి



కరెంట్ కోతలు నివారించి పంటలు కాపాడాలని మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం కంభాలపల్లి సబ్‌స్టేషన్ ఎదుట ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో బుధవారం రైతులు ధర్నా నిర్వహించారు. వెంటనే కోతలను ఎత్తివేసి నిరంతర విద్యుత్తు సరఫరా చేయాలని కోరారు. - బయ్యారం

# ఆ 4 పథకాలు ఆగినట్టే!

మొదటిపేజీ తరువాయి...

రైతుల ఖాతాల్లో జమ చేసేందుకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం సిద్ధమవగా.. ఎన్నికల కోడ్ పేరుతో కాంగ్రెస్ పార్టీ నిలిపివేయించిన సంగతి తెలిసిందే. అధికారంలోకి రాగానే రైతు భరోసా కింద ఒక్కొక్కరికి రూ.15 వేల చొప్పున ఇస్తామని ఆ పార్టీ ఊదరగొట్టింది. అనంతరం అధికారంలోకి వచ్చాక క్యాబినెట్ సబ్ కమిటీ పేరుతో రేవంత్‌రెడ్డి సర్కారు కాలయాపన చేసింది. గత 14 నెలల్లో మూడుసార్లు రైతులకు పెట్టుబడి సాయం అందించాల్సి ఉండగా రెండుసార్లు మొండి చెయ్యి చూపింది. చివరికి యాసంగిలో పెట్టుబడి సాయాన్ని ఎగ్గొట్టి వానకాలం సమయంలో వేసింది. ఆ సాయాన్ని కూడా రూ.12 వేలకే పరిమితం చేసింది. రైతు భరోసాను రూ.12 వేలకు పెంచాలని ఈ నెల 4న క్యాబినెట్ సమావేశంలో నిర్ణయం జరిగింది. కనీసం ఆ మరుసటి రోజు నుంచే ఆ పథకాన్ని అమలు చేస్తే ఇప్పటికే రైతుల ఖాతాల్లో నిధులు జమ అయ్యేవి. కానీ, రైతులను ఊరించిన రేవంత్ సర్కారు.. చివరికి ఈ నెల 26 నుంచి ఆ పథకాన్ని అమలు చేసింది. ముందుగా ఎంపిక చేసిన గ్రామాల్లోని వారికి మాత్రమే రైతు భరోసా వేస్తామని చెప్పింది. దాన్ని కూడా అరకొర గానే జమ చేసింది. ఇప్పుడు ఎన్నికల కోడ్ రావడంతో మిగతా రైతులకు మార్చి 4 వరకు రైతుభరోసా నిధులు అందే అవకాశం లేదు.

**ఇందిరమ్మ ఇండ్లకు మోక్షమెప్పుడు?**

రాష్ట్రంలో ఇందిరమ్మ ఇండ్ల కోసం నిరుపేదలు 14 నెలలుగా ఎదురుచూస్తున్నారు. అప్పుడు ఇప్పుడు అంటూ వారిని ఊరిస్తూ వచ్చిన రేవంత్‌రెడ్డి సర్కారు.. ప్రజల నుంచి ఒకటికి రెండుసార్లు దరఖాస్తులు తీసుకుంది. చివరికి గ్రామాల్లో వివాదాలు, ఘర్షణల మధ్య ఈ నెల 26న పథకాన్ని



ప్రారంభించింది. కానీ, ఇప్పుడు ఎన్నికల కోడ్ నేపథ్యంలో నిధులు విడుదల చేయలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో ఇందిరమ్మ ఇండ్లకు మరోసారి బ్రేక్ పడిందని, ఆ పథకానికి ఇప్పట్లో మోక్షం కలిగేలా లేదని అర్హులు వాపోతున్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులది కూడా ఇదే పరిస్థితి.

**ఏడాదంతా డౌటే!**

ఆగిపోయిన నాలుగు పథకాలు ఈ ఏడాది తిరిగి ప్రారంభమయ్యే పరిస్థితి లేదు. ప్రస్తుతం అమల్లోకి వచ్చిన ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ మార్చి మొదటి వారంలో ముగుస్తుంది. ఆ తర్వాత మరోసారి ఎమ్మెల్సీ ఎన్నికలతోపాటు స్థానిక, మున్సిపల్, జీహెచ్‌ఎంసీ ఎన్నికలతో ఈ ఏడాదంతా కోడ్‌తోనే గడిచిపోనున్నది. దీంతో ఆ 4 పథకాలకు ఈ సంవత్సరంలో మోక్షం కలిగే అవకాశం లేదు.

**ఉద్దేశపూర్వకంగానే 26న?**

రాష్ట్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే ఈ 4 పథకాలను ఈ నెల 26న ప్రారంభించినట్టు స్పష్టమవుతున్నది. ముగ్గురు ఎమ్మెల్సీల పదవీకాలం మార్చి 29తో ముగుస్తుందని, ఈ లెక్కన జనవరి చివర్లో ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తుందని ప్రభుత్వానికి ముందే తెలుసు. ప్రస్తుతం రాష్ట్ర ఆదాయం పడిపోవడంతో రేవంత్‌రెడ్డి సర్కారు తీవ్ర నిధుల కొరతతో సతమతమవుతున్నది. మరోవైపు రాష్ట్రానికి అప్పులు ఇవ్వకుండా రిజర్వు బ్యాంకు కట్టడి చేస్తున్నది. ఈ నేపథ్యంలో ఇప్పటికే ఉన్న పథకాల అమలే ప్రభుత్వానికి భారంగా మారింది. ఇలాంటి సమయంలో కొత్త పథకాల అమలు సాధ్యం కాదని ఆర్థిక నిపుణులు పదే పదే స్పష్టం చేస్తున్నారు. అందుకే తూతూ మంత్రంగా పథకాలను ప్రారంభించి ఎన్నికల కోడ్ పేరుతో వాటి అమలును నిలిపివేసేలా రేవంత్‌రెడ్డి సర్కారు ప్లాన్ చేసినట్టు తెలుస్తున్నది. ఆ పథకాలను అమలు చేయాలన్న చిత్తశుద్ధి ప్రభుత్వానికి ఉంటే వెంటనే ఎన్నికల సంఘానికి లేఖ రాసి, అనుమతి తీసుకోవాలని విమర్శకులు సూచిస్తున్నారు.

## మూడు ఎమ్మెల్సీ స్థానాలకు 27న ఎన్నికలు

మొదటిపేజీ తరువాయి...

నుంచి కే రఘోత్తమ్‌రెడ్డి, వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి అలుగుబెల్లి నర్సిరెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ ముగ్గురి పదవీ కాలం మార్చి 29తో ముగియనున్నది. ఈ క్రమంలోనే మార్చి 8వ తేదీలోగా ఈ మూడు స్థానాల ఎన్నికకు లాంఛనాలు పూర్తిచేయనున్నట్టు ఎన్నికల సంఘం షెడ్యూల్‌లో స్పష్టం చేసింది. ఫిబ్రవరి 27వ తేదీ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. మార్చి 3వ తేదీన ఓట్ల లెక్కింపు ఉంటుందని ఈసీ షెడ్యూల్‌లో వెల్లడించింది.

**ఏపీలోనూ 3 స్థానాలకు..**

ఆంధ్రప్రదేశ్‌లో కూడా రెండు పట్టభద్రులు, ఒక టీచర్ ఎమ్మెల్సీ స్థానాలను భర్తీ చేసేందుకు ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను ప్రకటించింది. ఉభయగోదావరి జిల్లాలు, గుంటూరు, కృష్ణా నియోజకవర్గాల్లో రెండు పట్టభద్రుల స్థానాలకు, శ్రీకాకుళం-విజయనగరం-విశాఖ జిల్లాలోని ఒక టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి ఎన్నికలను నిర్వహించనున్నట్టు వెల్లడించింది.

## రాబందు సర్కార్‌ను రైతాంగం క్షమించదు

**పాలమూరు వేరుశనగ రైతుల ఆందోళన కనిపించటం లేదా?**

**సీఎం రేవంత్‌పై ఎమ్మెల్సీ కవిత ఫైర్**



హైదరాబాద్, జనవరి 29 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో రైతుల పాలిట రాబందుగా మారిన కాంగ్రెస్ సర్కార్‌ను రైతాంగం క్షమించదని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. పాలమూరు వేరుశనగ రైతుల ఆందోళన కనిపించటం లేదా? అని సీఎం రేవంత్‌రెడ్డిని ఆమె ప్రశ్నించారు. అసలే దిగుబడి లేక సతమతమవుతున్న రైతుకు గిట్టుబాటు ధర కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఒక పక్క వ్యాపారుల మోసం, మరో పక్క ప్రభుత్వం శీతకన్ను వేయడం వల్ల వేరుశనగ రైతుల ఆందోళనతో మహబూబ్‌నగర్ జిల్లా అట్టుడుకుతున్నదని తెలిపారు. పోలీసుల బందోబస్తు నడుమ వేరుశనగ కొనుగోలు జరపాల్సిన దుస్థితి రావడం దారుణమని పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలన రైతుల పాలిట శాపంగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే ప్రభుత్వం మేల్కొని వేరుశనగ పంటకు గిట్టుబాటు ధర కల్పించడమే కాకుండా మార్కెట్ యార్డుల్లో వ్యాపారులు, కమీషన్‌దారుల ఆగడాలను అరికట్టాలని ఆమె డిమాండ్ చేశారు.

- రేచపల్లిలో యూరియా కోసం రైతుల బారులు



జగిత్యాల జిల్లా సారంగాపూర్ సహకార సంఘంలోని రేచపల్లి గోదాం వద్ద రైతులు యూరియా కోసం బుధవారం ఉదయం నుంచీ బారులు తీరారు. ఈ విషయమై సహకార సంఘ సీఈవో శివకుమార్‌ను వివరణ కోరగా రేచపల్లిలో ఒక్కో రైతుకు 3 బస్తాలు, సారంగాపూర్‌లో 5 బస్తాల చొప్పున పంపిణీ చేసినట్టు వెల్లడించారు. -సారంగాపూర్

- ఖాళీ బిందెలతో ధర్నా



నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్‌లోని 19వ వార్డుకు చెందిన మహిళలు బుధవారం తాగునీటి కోసం మున్సిపాలిటీ కార్యాలయం వద్ద ఖాళీ బిందెలు, బకెట్లతో ఆందోళనకు దిగారు. ఐదు నెలలుగా నీళ్లు సక్రమంగా సరఫరా కావడంలేదని, మున్సిపల్ అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా సమస్య తీరడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. -కొల్లాపూర్ రూరల్



నగర రైతు కూలీలకు ఆత్మీయ భరోసా ఇవ్వాలంటూ చేసిన తీర్మానం కాపీని మేయర్‌కు అందజేస్తున్న బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు

## నగర కూలీలకు ఆత్మీయ భరోసా ఇవ్వాలి

- గ్రేటర్ వరంగల్ కౌన్సిల్ సమావేశంలో బీఆర్‌ఎస్ ప్రతిపాదన
- తీర్మానం చేయాలని పట్టుబట్టిన బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు
- పోడియం వద్ద ప్లకార్డులతో నిరసన
- ఎట్టకేలకు ఆమోదించిన కౌన్సిల్

వరంగల్, జనవరి 29 : గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్‌లో విలీన గ్రామాల రైతు కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం అమలు చేయాలని బల్దియా సర్వసభ్య సమావేశంలో బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు పట్టుబట్టారు. బుధవారం మేయర్ గుండు సుధారాణి అధ్యక్షతన జరిగిన గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ సర్వసభ్య సమావేశం ప్రారంభమైన వెంటనే బీఆర్‌ఎస్ పక్షాన కార్పొరేటర్లు తీర్మానాన్ని ప్రతిపాదించారు. ఎజెండా అంశాలకు ముందే నగర విలీన గ్రామాల రైతు కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం ద్వారా రూ. 12 వేలు అందించాలనే తీర్మానాన్ని ఆమోదించాలని బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు డిమాండ్ చేశారు. ఎజెండా అంశాల తర్వాత తీర్మానంపై ఆమోదిస్తామని మేయర్ గుండు సుధారాణి చెప్పడంతో బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు పోడియంం వద్ద బైఠాయించారు. దీంతో ఎజెండా అంశాల తర్వాత రైతు కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ తీర్మానానికి కౌన్సిల్ ఆమోదం తెలిపింది. తీర్మానాన్ని ప్రభుత్వానికి పంపిస్తామని మంత్రి కొండా సురేఖ సమావేశంలో ప్రకటించారు.

**నగర రైతు కూలీలకు ఆత్మీయ భరోసా ఇవ్వాలి**

నగర విలీన గ్రామాల రైతు కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వర్తింప చేయాలి. వారికి ఆత్మీయ భరోసా ఇచ్చేవరకు పోరాడుతాం. కాంగ్రెస్ పాలకవర్గం నగరాభివృద్ధికి చేసింది ఏమీ లేదు. కౌన్సిల్ సమావేశం సీఎం రేవంత్‌రెడ్డి పొగడ్తలకే సరిపోయింది. బీఆర్‌ఎస్ కార్పొరేటర్లకు ప్రొటోకాల్ ఇవ్వకుండా అధికారులు అవమాన పరుస్తున్నారు. విపక్ష కార్పొరేటర్ల డివిజన్లకు నిధులు కేటాయించకుండా వివక్ష చూపుతున్నారు. దీనిపై కేసీఆర్, కేటీఆర్ నాయకత్వంలో పోరాడుతాం.

-ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి



సమావేశానికి హాజరైన ఎమ్మెల్సీ పోచంపల్లి, బస్వరాజు సారయ్య

## మృతులకూ ఇందిరమ్మ ఆత్మీయభరోసా!


- లబ్ధిదారుల్లో చనిపోయినవారి పేర్లు
- మరణించి 12 ఏండ్లయినా ఎంపిక
- 8 మంది కూలీల పేర్లూ ప్రత్యక్షం
- అవాక్కైన జంగిలికొండ గ్రామస్థులు

మహబూబాబాద్ రూరల్, జనవరి 29 : ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద ఎంపిక చేయబడిన లబ్ధిదారుల జాబితాలో పలువురు మృతుల పేర్లు ప్రత్యక్షం కావడంతో మహబూబాబాద్ రూరల్ మండలం పరిధిలోని జంగిలికొండ గ్రామస్థులు అవాక్కయ్యారు. వారిలో 12 ఏండ్ల క్రితం చనిపోయిన రైతుకూలీల పేర్లూ ఉండటంతో.. 'ఇదేం లబ్ధిదారుల ఎంపిక.. బాబోయ్' అంటూ గ్రామస్థులు వాపోతున్నారు. ఇటీవల నిర్వహించిన గ్రామసభల్లో ఇందిరమ్మ ఆత్మీయభరోసా పథకంలో అర్హుల జాబితాలో చనిపోయినవారి పేర్లను అధికారులు చదివి వినిపించడంతో ఈ విషయం బయటకొచ్చింది. వివరాలిలా ఉన్నాయి. మహబూబాబాద్ జిల్లా మహబూబాబాద్ మండల పరిధిలోని జంగిలికొండ గ్రామపంచాయతీలో 2 రోజుల క్రితం నిర్వహించిన గ్రామసభలో ఇందిరమ్మ ఆత్మీయ భరోసాపథకం కింద ఎంపిక చేసిన అర్హుల పేర్లను అధికారులు చదివి వినిపించారు. జాబితాలో 12 సంవత్సరాల క్రితం చనిపోయిన కూలీలు నారాయణ, ప్రమీల పేర్లు రావడంతో గ్రామసభ విస్తుపోయింది. వారిద్దరితోపాటు మరో ఆరుగురు చనిపోయిన కూలీల పేర్లు కూడా జాబితాలో ఉండటంతో కలకలం మొదలైంది. చనిపోయిన 8 మంది పేర్లను ఆత్మీయభరోసా కింద ఎలా ఎంపిక చేశారని గ్రామస్తులు నిలదీశారు. ఉపాధి జాబ్ కార్డుల ఆధారం ఎంపిక చేశామని, అక్కడే పొరపాటు జరిగిందని అధికారులు చెప్పుకొచ్చారు. ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్, మేట్, సెక్రటరీ కలిసి చనిపోయిన వ్యక్తుల పేర్లు ఎక్కించి వారు పని చేస్తున్నట్టుగా చూయిస్తూ హాజరు వేసి డబ్బు స్వాహా చేసినట్టు గ్రామస్తులు ఆరోపించారు.

## ఇథనాల్ కంపెనీ ఏర్పాటును రద్దు చేయాలి

**ఎమ్మెల్సీ చల్లా, ఎమ్మెల్యే విజయుడు డిమాండ్ • గద్వాల జిల్లా పెద్ద ధన్వాడలో రైతు దీక్షలకు మద్దతు**

అలంపూరు/రాజోళి, జనవరి 29 : పచ్చని గ్రామాల మధ్య చిచ్చు పెట్టే ఇథనాల్ కంపెనీ ఏర్పాటును ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించేది లేదని ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి స్పష్టంచేశారు. ఆ కంపెనీ అనుమతులను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జోగులాంబ గద్వాల జిల్లా రాజోళి మండలం పెద్ద ధన్వాడలో రైతులు ఇథనాల్ కంపెనీ ఏర్పాటును నిరసిస్తూ అఖిలపక్షం ఆధ్వర్యంలో రిలే దీక్షలు చేపట్టారు. బుధవారం ఎమ్మెల్యే విజయుడుతో కలిసి ఎమ్మెల్సీ చల్లా మద్దతు తెలిపారు. రైతులకు కీడు చేసే కంపెనీలు ఏవైనా అనుమతించేది లేదని స్పష్టంచేశారు. రైతులకు ఏ కష్టం వచ్చినా తాము ఉంటామని భరోసా కల్పించారు. రైతుల అభిప్రాయాలు సేకరించకుండా ఇష్టానుసారంగా ఎలా ఏర్పాటు చేస్తారని, ఇథనాల్ పరిశ్రమ అనుమతులు రద్దు చేయాలని కోరుతూ ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి, కలెక్టర్‌కు వినతిపత్రాలు అందజేసినట్టు తెలిపారు. ఇథనాల్ కంపెనీ అనుమతులను ప్రభుత్వం రద్దు చేసే వరకు ఊరుకునేది లేదని ఎమ్మెల్యే విజయుడు తేల్చిచెప్పారు.



రాజోళి మండలం పెద్ద ధన్వాడలో రైతులు చేపట్టిన రిలే దీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి. చిత్రంలో అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు

## బిల్లులు రాకపోతే ఆత్మహత్యే శరణ్యం

- తెల్లరాళ్లపల్లి జీపీ వద్ద మాజీ సర్పంచ్ ఆందోళన



పాన్‌గల్, జనవరి 29: తన హయాంలో అభివృద్ధి పనులు చేపట్టినా నేటికీ బిల్లులు రాలేదని మాజీ సర్పంచ్ శాంతమ్మ వాపోయారు. బుధవారం ఆమె వనపర్తి జిల్లా పాన్‌గల్ మండలం తెల్లరాళ్లపల్లి గ్రామ పంచాయతీ వద్ద నిరసన తెలిపారు. తండాలో వివిధ పనులు చేపట్టినా బిల్లులు మంజూరు కాలేదని విచారం వ్యక్తంచేశారు. పనుల కోసం ప్రైవేటు వడ్డీ వ్యాపారుల వద్ద రూ.12 లక్షలు అప్పు చేశానని తెలిపారు. ఈ విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయిందని, బిల్లులు ఇవ్వకుంటే తనకు ఆత్మహత్యే శరణ్యమని హెచ్చరించారు.



తహసీల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న బాధిత కుటుంబాలు

## ఎన్నెస్పీ స్థలంలోని నిర్మాణాల కూల్చివేత

**తహసీల్ ఎదుట బాధితుల ఆందోళన**

నిడమనూరు, జనవరి 29 : నల్లగొండ జిల్లా నిడమనూరు మండల కేంద్రంలోని ఎన్నెస్పీ క్యాంపు ఆవరణలో ఉన్న నిర్మాణాలను రెవెన్యూ అధికారులు బుధవారం కూల్చివేశారు. ఎన్నెస్పీ స్థలంలో మండల కేంద్రానికి చెందిన దళిత, వెనుకబడిన కుటుంబాలకు చెందిన ఉప్పునూరి సాంబయ్య, గనిపల్లి కోటమ్మ, నాగిళ్ల ఎల్లమ్మ ఇండ్లు నిర్మించుకొని సుమారు 40 ఏండ్లుగా నివాసం ఉంటున్నారు. 2016లో సర్వే నంబర్ 230లోని 0.32 గుంటల ఎన్నెస్పీ స్థలాన్ని కోర్టు భవన నిర్మాణానికి కేటాయించారు. ఇటీవల కోర్టు భవన నిర్మాణ పనులు పూర్తి కావడంతో కేటాయించిన స్థలంలో అక్రమ నిర్మాణాల తొలగింపునకు మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్ ఆదేశాలు జారీ చేశారు. దాంతో నిడమనూరు తహసీల్దార్ జంగాల కృష్ణయ్య ఆధ్వర్యంలో సిబ్బంది బుధవారం తెల్లవారుజామున జేసీబీతో అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. బాధితులు ఆందోళన చేపట్టకుండా హాలియా సీఐ జనార్దన్‌గౌడ్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. తాము 40 ఏండ్లుగా అక్కడే నివాసాలు ఏర్పాటు చేసుకొని ఉంటున్నామని, ప్రత్యామ్నాయం చూపకుండా.. ఇంట్లోని సామగ్రి తీసుకునేందుకు అవకాశమివ్వకుండా కూల్చివేయడం ఏమిటని ప్రశ్నించారు. అనంతరం బాధిత కుటుంబాలు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. జీవో 59 కింద స్థలాల క్రమబద్ధీకరణ కోసం తాము దరఖాస్తు చేసుకున్నామని, 25 శాతం ధర మేరకు రూ.40 వేలు కూడా చెల్లించినట్టు వారు తెలిపారు. సీపీఎం, ఎమ్మార్పీఎస్ నాయకులు వారికి మద్దతు తెలిపారు.